క్లుప్తంగా

సర్కారు బడిలో డిజిటల్ పాఠాలు ప్రారంభం



డిజిటల్ స్క్రీన్‌పై విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న హెచ్‌ఎం విజయ

చంద్రగిరి (తిరుపతి రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ పాఠాల బోధనను ప్రవేశపెట్టారు. చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం డిజిటల్ పాఠాలను హెచ్‌ఎం విజయ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ డిజిటల్ స్క్రీన్ ద్వారా పాఠాలు నేర్చుకోవడం చాలా సులభమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణమూర్తి, రమేష్, రామమూర్తి, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

మద్యం అమ్మకాల్లో నిబంధనలు పాటించాలి



మద్యం దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

పాకాల: మద్యం అమ్మకాల్లో నిబంధనలు పాటించాలని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి తెలిపారు. ఆయన గురువారం పాకాల మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం నియంత్రణ కోసం ప్రభుత్వం డిజిటల్ ప్రక్రియను అమలులోకి తెచ్చిందన్నారు. దుకాణాల్లో డిజిటల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. బాటిల్ టు బాటిల్ తనిఖీ చేయడం వల్ల సిబ్బంది పొరపాట్లు చేయడానికి అవకాశం ఉండదన్నారు. వెరిఫికేషన్ ఆఫీసర్ నాగరాజు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

30న ఢిల్లీలో ధర్నా

తిరుపతి ఎడ్యుకేషన్: శాశ్వత ప్రాతిపదికన జాతీయ వేతన సంఘాన్ని ఏర్పాటుచేయాలని కోరుతూ ఈ నెల 30వ తేదీన ఢిల్లీలో ధర్నా చేపట్టనున్నట్టు ఏపీటీఎఫ్‌-1938 జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటముని ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కొత్త పెన్షన్ స్కీమ్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, టెంపరరీ, శిక్షా మిత్రా, శిక్షా సహాయక్, విద్యా వలంటీర్ తదితర తాత్కాలిక నియామకాలను రద్దు చేయాలని కోరారు. వాటి స్థానంలో టైం స్కేల్ ప్రాతిపదికన పూర్తి స్థాయి నియామకాలు చేపట్టాలని వెల్లడించారు. ఇందులో భాగంగా ఆల్ ఇండియా ఓల్డ్ పెన్షన్ రివైవల్ ఫ్రంట్(ఏఐఓపీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

సుధాకర్‌కు అభినందనలు



సుధాకర్‌ను అభినందిస్తున్న గ్రామస్తులు

పాకాల: మండలంలోని పాకాల-2 వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుడిగా ఎంపికైన సుధాకర్‌ను గురువారం ఆ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పంచాయతీ అధ్యక్షుడిగా ఎంపిక చేసిన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి రుణపడి ఉంటానని సుధాకర్ తెలిపారు. మురళీకృష్ణ, వంశీ, బాలకృష్ణ, వెంకటేష్, సురేష్, శేఖర్, నిత్యానందం, ఆంథోని, ముషీర్, ఆర్ముగం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ హార్స్‌లైన్‌ను తనిఖీ చేసిన డీడీజీ



గుర్రాలకు ఫీడింగ్ ఇస్తున్న డీడీజీ వీఎం రెడ్డి

తిరుపతి సిటీ: తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ ప్రధాన కార్యాలయం, వెటర్నరీ కళాశాల ప్రాంగణంలో వున్న హార్స్‌లైన్ యూనిట్‌ను గురువారం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టర్ వీఎం రెడ్డి తనిఖీ చేశారు. తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్‌కు సంబంధించిన ట్రైనింగ్‌పై ఆరా తీశారు. తెలుగు రాష్ట్రాల్లో అపారమైన ప్రతిభావంతులైన యువత ఉందని, వారిని సరైన క్రమశిక్షణతో భావిభారత పౌరులుగా, ఆదర్శనీయులు తీర్చిదిద్దాల్సి అవసరం ఉందన్నారు. అనంతరం ఆయన హార్స్‌లైన్ యూనిట్ పరిశీలించి గుర్రాల ఆరోగ్యంపై ఆరా తీశారు.

కాలూరులో పొలంబడి

తిరుపతి రూరల్: మండలంలోని కాలూరులో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి సంగన మమత, సచివాలయం వ్యవసాయ సహాయకులు జోత్స్న, సిబ్బంది రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు.

ఆకట్టుకుంటున్న చిత్రాలు

ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో సుందరీకరణ పనులను మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టింది. ఇందులో భాగంగా శ్రీనివాస సేతు, బాలాజీ నగర్, ఆర్సీరోడ్డు రైల్వేగేటు, కొన్ని ప్రధాన కూడళ్లలో గోడలు, రోడ్డు డివైడర్లకు చిత్రిస్తున్న చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే డివైడర్ల మధ్య మొక్కలు నాటుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



ఆర్సీరోడ్డు రైల్వే గేటు రోడ్డులో ఆకట్టుకుంటున్న పెయింటింగ్స్





లీలామహల్ వద్ద ఆకట్టుకుంటున్న బొమ్మలు, డివైడర్ మధ్య నాటిన మొక్కలు

సుబ్రమణ్యస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి, మోహిత్‌రెడ్డి

పాకాల: స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆగస్టు 6 నుంచి 10వ తేదీ వరకు 75 ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం తుమ్మలగుంటలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులకు నిత్యం అన్న ప్రసాదాలు అందించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి, ఈవో మునిశేఖర్ మాట్లాడుతూ 6న మూషిక వాహనంపై వినాయకస్వామి, 7న నంది వాహనంపై పార్వతీపరమేశ్వరులు, 8వ తేదీన నెమలి వాహనంపై సుబ్రమణ్యస్వామి విహరిస్తారని తెలిపారు. 9వ తేదీన పుష్పపల్లికి సేవ, 10వ తేదీన యాగపూజ, పూర్ణాహుతి, కలశాభిషేకం, తోటోత్సవం, కంకణ విసర్జన, ధ్వజాఅవరోహణం ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్‌ఈబీ సీఐ లీలారాణి

చంద్రగిరి(తిరుపతి రూరల్): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెబ్ సీఐ లీలారాణి తెలిపారు. చంద్రగిరి బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మాదకద్రవ్యాలు, దిశ, సైబర్ క్రైంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. ఎంతోమంది విద్యార్థులు తమ ప్రతిభతో ముఖ్యమంత్రి నుంచి అవార్డులు అందుకున్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బయట వ్యక్తుల మాటలు నమ్మి మత్తు పదార్థాలు, మద్యం తదితరాలకు అలవాటు పడకూడదన్నారు. ఎవరైనా విద్యార్థులు చెడు అలవాట్లకు లోనైతే ఎస్‌ఈబీ అధికారులు లేదా ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఎంఈవో విజయ, సెట్విన్ మేనేజర్ మోహన్ కుమార్, ఎస్ఐ చైతన్య, దిశ ఏఎస్ఐ రోహిణి పాల్గొన్నారు.

మహిళల భద్రతే లక్ష్యంగా రైల్వే భద్రతా దళం సేవలు

తిరుపతి కల్చరల్: మహిళల భద్రతే లక్ష్యంగా రైల్వే భద్రతా దళం కృషి చేస్తోందని రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మధుసూదన్ తెలిపారు. రాస్ కార్యాలయంలో గురువారం మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో ఎంతో మంది నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళలు, ఇంటి నుంచి తప్పిపోయిన పిల్లలు ఉంటున్నారని తెలిపారు. రైళ్లలో ఒంటరిగా ప్రయాణించే మహిళలు ఎన్నోసార్లు ఇబ్బందులు పడుతుంటారని వెల్లడించారు. వారి భద్రత కోసం మహిళా సురక్ష, మాతృ శక్తి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఒంటరిగా ప్రయాణించే మహిళలకు ఆర్పీఎఫ్ చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. ప్రయాణంలో ఏవైనా ఇబ్బందులు కలిగితే రైల్వే ట్రోల్ ఫ్రీ నంబర్ 139లో సంప్రదించాలని కోరారు. తప్పిపోయిన పిల్లలను కాపాడేందుకు చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కి వివరాలు తెలిపాలన్నారు. అడ్మినిస్ట్రేటర్ సుజాత మాట్లాడుతూ బాధిత మహిళలకు నివాస, వైద్య, న్యాయ సంబంధిత సహాయాన్ని అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శైలజ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, రాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

వెయ్యి రోజులకు చేరిన అటవీ కార్మికుల దీక్షలు



మాట్లాడుతున్న సీహెచ్.నర్సింగరావు

తిరుపతి కల్చరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీటీడీ అటవీ కార్మికులు ఇస్కాన్ రోడ్డులోని, టీటీడీ డీఎఫ్‌వో కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి వెయ్యి రోజులకు చేరాయి. ఈ సందర్భంగా వారికి మద్దతుగా కార్మిక సంఘాల నేతలు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ టీటీడీ పరిపాలనా భవనం నుంచి దీక్షా శిబిరం వరకు సాగింది. అక్కడి ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరర్సింగరావు మాట్లాడుతూ అటవీ కార్మికుల పట్ల టీటీడీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి చూపడం సరికాదన్నారు. కార్మికులు వెయ్యి రోజులుగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవడం తగదన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో 27 జిల్లాల్లో ధర్నాలు చేపట్టినట్టు తెలిపారు. ఇప్పటికైనా కార్మికులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, నగర కార్యదర్శి సుబ్రమణ్యం, ఆర్పీఐ రాష్ట్ర నేత పి.అంజయ్య, ఐఎన్‌టీయూసీ నేత రత్నకుమార్, సీఐటీయూ నేతలు కందారపు మురళి, బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌రావు, జయచంద్ర, ఐద్వా సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ఎమ్మెల్యే చెవిరెడ్డి లక్ష్యం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, సర్పంచ్ వరలక్ష్మి

తిరుపతి మంగళం: చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి లక్ష్యమని మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ తెలిపారు. మంగళం పంచాయతీలో గురువారం సర్పంచ్ వరలక్ష్మి, ఉపసర్పంచ్ బైరెడ్డి రమేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 4 వేలు విలువ చేసే వైద్య పరీక్షలతో పాటు మందులను ఉచితంగా అందించడం పట్ల ఎమ్మెల్యే చెవిరెడ్డి, మోహిత్‌రెడ్డిలకు పంచాయతీ ప్రజలంతా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ చిలమంద హరికృష్ణ, ఎంపీటీసీలు లక్ష్మయ్య, లక్ష్మి, రాంబాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన హేయమైన చర్య



ర్యాలీ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: మణిపూర్‌లో మహిళలపై జరిగిన ఘటన హేయమైనదని పద్మావతి మహిళాయూనివర్సిటీ వీసీ డి భారతి తెలిపారు. యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు గురువారం పరిపాలనా భవనం నుంచి బాలాజీ కాలనీ కూడలి వరకు చేపట్టిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభిచారు. ఆమె మాట్లాడుతూ నాగరికత కొత్త పుంతలు తొక్కుతున్న నేటి సమాజంలో మహిళలపై లైంగిక దాడి, హింస చోటుచేసుకోవడం శోచనీయమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ మహిళలపై అమానవీయ సంఘటనలు జరగడం బాధాకరమన్నారు. అనంతరం విద్యార్థులు పరిపాలనా భవనం ముందు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

టీచింగ్ స్టాఫ్ క్రీడా పోటీలు ప్రారంభం

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఆ సంఘం అధ్యక్షుడు పీకే సుబ్రమణ్యం మాట్లాడుతూ సెప్టెంబర్ 2వ తేదీన జరగనున్న అసోసియేషన్ ఫౌండేషన్ దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలి రోజున క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించామని, మరిన్ని క్రీడా పోటీలను నిర్వహించి ఫౌండేషన్ రోజున విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యదర్శి ఎన్ సుబ్రమణ్యం, మనోజ్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి వరిలో మొలకలు



మొలకలు వచ్చిన కేఎన్ఎం 1638 రకం వరి పంట

తిరుపతి అర్బన్: జిల్లాలో మూడు రోజులుగా కురిసిన వర్షానికి వరి ధాన్యం మొలకలు వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిధాన్యంపై ఉప్పు నీటిని చల్లితే మొలకలు రాకుండా నివారించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. ముందుగా రైతులు తమ పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. తర్వాత నీటిలో 20 నుంచి 30 గ్రాములు ఉప్పు కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

బ్రహ్మర్షి ఆశ్రమంలో శ్రీలంక మంత్రి



జైన ఆలయంలో పూజలు చేస్తున్న శ్రీలంక న్యాయశాఖా మంత్రి విజయదాస్ రాజపక్సే

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురం సమీపంలో ఉన్న బ్రహ్మర్షి ఆశ్రమాన్ని గురువారం శ్రీలంక న్యాయశాఖ మంత్రి విజయదాస్ రాజపక్సే సందర్శించారు. ఆయనకు ఆశ్రమ నిర్వాహకులు స్వాగతం పలికారు. ఆయన జైన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గురవానంద గురూజీ ఆశీస్సులు తీసుకున్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి రిమాండ్

తిరుపతి లీగల్: వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో ఇద్దరికి ఆగస్టు 10వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి గురువారం ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి ఆటోనగర్‌కు చెందిన కె.వెంకటేష్ అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసులో నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అతని అడ్రస్ తెలపాలని పోలీసులు తిరుపతి కొర్లగుంట మారుతీ నగర్‌లోని జేఎస్‌కే టవర్స్‌లో నివాసముంటున్న జే.బాలాజీని అడిగారు. అతను వెంకటేష్ ఇంటిని చూపించాడు. దీనిపై కక్ష పెంచుకున్న వెంకటేష్ తన స్నేహితుడు పుత్తూరులోని గేట్ పుత్తూరుకు చెందిన షేక్ మస్తాన్, మరికొందరితో కలిసి ఈనెల 14వ తేదీ బాలాజీ ఇంటి వద్ద అతనిపై దాడి చేసి హత్య చేసేందుకు యత్నించారు. బాలాజీ ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితులు వెంకటేష్, షేక్ మస్తాన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రం ప్రారంభంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు

చంద్రగిరి(తిరుపతి రూరల్): రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. చంద్రగిరిలో గురువారం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం ద్వారా రైతులకు రూ.2వేల నగదును అకౌంట్‌లో జమచేస్తున్నట్లు తెలిపారు. ఏడీఏలు ధనుంజయరెడ్డి, మనోహర్‌బాబు, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రతినిధులు మురళి, మధు పాల్గొన్నారు.

జగనన్నది సంక్షేమ పాలన



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. చంద్రగిరి మండలం గంగుడుపల్లి, మిట్టపాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గంగుడుపల్లిలో 800 మందికి, మిట్టపాళ్యంలో 1170 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న కారణాల వల్ల కొంతమంది అర్హులకు సంక్షేమ పథకాలు అందలేదన్నారు. వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, సర్పంచులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, ధర్మారెడ్డి, ఎంపీటీసీ విమల, డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, అచ్యుత రెడ్డి, గురుమూర్తి యాదవ్, చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు లబ్ధి

పాకాల: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కె.వడ్డేపల్లి పంచాయతీలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని 1061 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గ్రామంలో ఏ సమస్యలున్నా తనకు తెలపాలని, పరిష్కారానికి చర్యలు చేపడతానని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, సర్పంచ్ కె.వరలక్ష్మి, ఉపసర్పంచ్ శ్రీరాములురెడ్డి, ఎంపీడీవో ప్రభాకర్, ఏవో పుష్పావతి, సెక్రటరీ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష

రామచంద్రాపురం: చిన్న చిన్న సమస్యలతో పథకాలు అందని అర్హులకు లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మిట్టకండ్రిగలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని 243 కులం, 246 ఆదాయ, 3 ఈడబ్ల్యూఎస్, కుటుంబ సభ్యుడు ధ్రువీకరణ పత్రాలు, 3 అడంగల్, 3 సీసీఆర్సీ కార్డులు, ఒక రేషన్ కార్డు, 9 ఆధార్ సేవలను అందించారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, తిరుపతి జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, రమేష్ రెడ్డి, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు చిట్టిబాబు, బాబు యాదవ్, ఎంపీటీసీలు కృష్ణవేణమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుల నియామకం



మునిరెడ్డి, కంభాల రవి, శివప్రసాద్, బాలసుబ్రమణ్యంరెడ్డి, గురవారెడ్డి, సాయిరాయల్, అవినాష్‌రెడ్డి



సురేంద్రరెడ్డి, చిరంజీవిరెడ్డి, హరికృష్ణ, నరేంద్ర, మొదలియార్ రమేష్, జానకిరామ్‌రెడ్డి, మల్లారపు మహేంద్ర



బీగాల చంద్రమౌళి, ఢిల్లీరెడ్డి, పెరుమాళ్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, హితేష్, రామమూర్తి, బాలకృష్ణ

తిరుపతి రూరల్: మండలంలోని పలు పంచాయతీలకు వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షులను నియమిస్తూ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కుంట్రపాకంకు జీపాలెం అవినాష్‌రెడ్డి, ఓటేరుకు బీగాల చంద్రమౌళి, పాడిపేటకు పెరుమాళ్‌రెడ్డి, పెరుమాళ్లపల్లికి సుబ్రమణ్యంరెడ్డి, పాతూరుకు కనకప్పగారి ఢిల్లీరెడ్డి, సాయినగర్‌కు హితేష్, కొత్తూరుకు రామమూర్తి, అవిలాలకు ఉదయగిరి బాలకృష్ణ, దుర్గసముద్రంకు కళత్తూరు సురేంద్రరెడ్డి, వేదాంతపురానికి చిరంజీవిరెడ్డి, మంగళంకు చిలమంద హరికృష్ణ, కేసీపేటకు నరేంద్ర, తిరుమలనగర్‌కు మొదలియార్ రమేష్, పేరూరుకు జానకిరామ్‌రెడ్డి, పుదిపట్లకు మల్లారపు మహేంద్ర, లింగేశ్వరనగర్‌కు సాయిరాయల్, గాంధీపురానికి గురవారెడ్డి, సీగొల్లపల్లికి బాలసుబ్రమణ్యంరెడ్డి, పైడిపల్లికి శివప్రసాద్, మల్లంగుంటకు కంభాల రవి, రామానుజపల్లికి మునిరెడ్డి నియమితులయ్యారు.

సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల నిరసన

తిరుపతి రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు గురువారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ దేవేంద్ర రెడ్డి, కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. జేఎల్ఎం గ్రేడ్ -2 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను బకాయిలతో చెల్లించాలని, ఒకే మాస్టర్ స్కేలును వర్తింపజేయాలని, 1999-2004 మధ్య నియమితులైన ఉద్యోగులకు జీపీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ తిరుపతి సర్కిల్ చైర్మన్ గోపి, కన్వీనర్ మురళి, జేఏసీ నాయకులు జయప్రకాష్, చలపతి, జయరామయ్య, నాగరాజు, రంగారావు, విద్యుత్ సంస్థల ఉద్యోగులు, సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

తాళపత్ర గ్రంథాల సంరక్షణకు చర్యలు



తాళపత్ర గ్రంథాలను పరిశీలిస్తున్న వీసీ రాజారెడ్డి, టీటీడీ డీఈఓ భాస్కర్‌రెడ్డి

తిరుపతి సిటీ: తాళపత్ర గ్రంథాలను 1956 నుంచి పసిబిడ్డలా సంరక్షిస్తున్నామని ఎస్వీయూ వీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డితో కలిసి యూనివర్సిటీలోని ప్రాచ్య పరిశోధనా సంస్థను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎస్వీయూలోని ప్రాచ్య పరిశోధనా సంస్థకు ఎంతో విశిష్టత ఉందన్నారు. శాసనమండలి కమిటీ, న్యాక్ కమిటీ సంస్థ విశిష్టతను పరిశీలించి సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీగా గుర్తించారని చెప్పారు. కార్యక్రమంలో పరిశోధనా సంస్థ సంచాలకులు పీసీ వెంకటేశ్వర్లు, రాజశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

30న తులసీ మహత్యం ఉత్సవం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో 30వ తేదీన తులసి మహత్యం ఉత్సవం నిర్వహించనున్నారు. స్వామివారికి తులసి దళం అత్యంత ప్రీతికరమైంది. శ్రావణ శుద్ధ ద్వాదశినాడు తులసి ఆవిర్భావం సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు గోవిందరాజస్వామి గరుడ వాహనంపై కొలువుదీరి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. అనంతరం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఆస్థానం ఘనంగా జరుగనుంది. ఇందులో అర్చకులు తులసి మహత్యం పురాణాన్ని పఠిస్తారు.